# ఇంటర్ పరీక్షకు

# 96.63% హాజరు





- 17,010 మంది విద్యార్థుల గైర్హాజరు
- హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్..
- వందలాది మంది ఆలస్యంగా కేంద్రాలకు
- పలుచోట్ల పరీక్ష రాయకుండానే వెనక్కి
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసిన రోడ్డు

## హైదరబాద్ లో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఇంటర్ పరీక్షలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. గ్రేటర్ వ్యాప్తంగా 97.50శాతం మంది (2.29లక్షల) విద్యార్థులు పరీక్షలు రాయగా, 6,135 మంది గైర్హాజరయ్యారు. సకాలంలో ఇంటర్ పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం విద్యార్థులకు సవాలుగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రులు సొంత వాహనాలు తీసుకుని రోడ్లమీదకు రావడంతో ట్రాఫిక్ చిక్కులు ఎదురయ్యాయి.

| జిల్లా | మొత్తం విద్యార్థులు | హాజరైన వారు | గైర్హాజరు | హాజరు శాతం |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 90,351 | 87,523 | 2,828 | 96.8 |
| రంగారెడ్డి | 83,829 | 81,966 | 1,863 | 97.7 |
| మేడ్చల్ | 71,286 | 69,842 | 1,444 | 97.9 |

**తెలంగాణ / హైదారాబాద్ బ్యూరో రవీంద్ర , మార్చి 05(డైలీ రిపోర్ట్):**

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 1,532 కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ భాష (పేపర్–1)పరీక్షకు 96.63 శాతం హాజరయ్యారు. మొత్తం 5,14,184 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 4,96,899 మంది హాజరయ్యారని, 17,010 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు ప్రత్యేక పరిశీలకులను పంపామన్నారు. పరీక్షల ఏర్పాట్లను కృష్ణ ఆదిత్య స్వయంగా పరిశీలించారు. హైదరాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన బుధవారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయగా, అన్నిచోట్లా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఇక, హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌తో వందల సంఖ్యలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయారు. కొన్నిచోట్ల ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించగా, గేట్లు మూసేయడంతో ఆపై ఆలస్యంగా వచ్చిన వారు వెనుదిరగాల్సి వచ్చింది. కాగా, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 4,40,788 రెగ్యులర్, 67,735 ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 5,08,523 విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.